సమాచారం ఇవ్వట్లేదు..!

- స.హ.చట్టం ఉన్నా లేనట్టే..
- ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టింపు కరువు
- దరఖాస్తుదారునికి సహకరించని అధికారులు
- కొన్నిచోట్ల తప్పుదోవ పట్టించేలా సమాచారం



బాన్సువాడ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డు

బాన్సువాడ : బాన్సువాడ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా వెలుస్తున్న వెంచర్లపై సమాచారం కోసం మున్సిపాలిటీలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకున్నాడు. దరఖాస్తుదారుడికి మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. రెండు నెలలు గడుస్తున్న సమాచారం ఇవ్వకపోవడంలో అంతర్యామేముందో అధికారులే తెలియాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం ఇలా అపహాస్యంగా మారింది. చట్టం ఉండీ లేనట్టుగా తయారైంది. గతంలో ఆర్టీఐ కింద ఎవరైన సమాచారం అడిగితే ఆ కార్యాలయంలో, ఆ శాఖలో అవినీతి, అక్రమాలు చేసి ఉంటే అధికారులు భయపడే పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు ఇది నిర్వీర్యం కావడంతో వారిని ప్రశ్నించే వారే లేనట్లుగా వ్యవస్థ కొనసాగుతుందన్న ఆవేదన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

జిల్లా కమిటీ ఏర్పాటే లేదు..

స.హ. చట్టం అమలుకు సంబంధించి ప్రతి జిల్లాలో కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కూడా సభ్యులుగా ఉండాలి. ప్రతి మూడు నెలలకొక సారి ఈ చట్టం అమలుకు సంబంధించి రివ్యూ నిర్వహించి లోటుపాట్లను సవరించాలి. అయితే అసలు కమిటీ ఏర్పాటుకు ఇప్పటి వరకు అడుగుపడలేదని పౌరులు పేర్కొంటున్నారు. దరఖాస్తుదారుడికి 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలని నిబంధన ఉంది. ఆ వ్యవధి దాటిన తర్వాత సమాచారం ఇవ్వనందుకు జరిమానా విధించేలా నిబంధనలు ఉన్నాయి. అయితే ఇవన్ని నామమాత్రంగా మారి, ప్రభుత్వ కార్యాలయాల్లో జవాబుదారీతనం లోపించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏదీ సాధికారిత..

రాజ్యాంగం ప్రకారం సమాచార హక్కు ప్రాథమిక హక్కుగా అభివర్ణిస్తారు. దీన్ని లక్ష్యం పౌరులకు సాధికారిత కల్పించడం, ప్రభుత్వ పనిలో పారదర్శకత, జవాబుదారీ తనం పెంపొందించడం, అవినీతిని అరికట్టడం, ప్రజల కోసం పనిచేసేలా చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. అయితే కొన్నేళ్లుగా దీని లక్ష్యం పక్కదారి పట్టింది. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచారం ఇచ్చేందుకు వ్యవస్థ ఉంటుంది. అయితే ప్రస్తుతం నామమాత్రంగా మారిందనే విమర్శలు బాహాటంగానే వ్యక్తమవుతున్నాయి.

జీపీ భూములను సర్వే చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

లింగంపేట(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో సంబంధిత కార్యదర్శులు గ్రామ పంచాయతీల భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని రైతువేదికలో లింగంపేట, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, గాంధారి మండలాలకు చెందిన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీకి చెందిన విలువైన ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సర్వే నిర్వహించి గుర్తించిన భూముల వివరాలు సకాలంలో అందజేయాలని సూచించారు. గుర్తించిన భూములకు హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మిషన్ భగీరథ నల్ల కనెక్షన్ ఎన్ని ఇళ్లకు ఉన్నాయనే వివరాలను ఇంటింటికి వెళ్లి సర్వే ఆధారంగా గుర్తించాలన్నారు. వారం రోజుల్లో సర్వే నిర్వహించి నివేదిక పంపాలన్నారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్ల కనెక్షన్ తప్పనిసరి ఉండాలన్నారు. అలాగే వర్షాకాలం సమీపించడంతో సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని వీధుల్లో చెత్తా, చెదారం తొలగించాలన్నారు. మురికి కాల్వలు శుభ్రం చేయించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సురేందర్, ఎంపీవోలు, నాలుగు మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ నాయకుల సంబరాలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు ఎండ్రియాల్, బ్రహ్మజీవాడి, బ్రాహ్మణపల్లి, చిట్యాల, ఎర్రాపహాడ్, కృష్ణాజీవాడి, కన్కల్, తదితర గ్రామాలలో బీజేపీ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రోడ్లపై పటాకులు కాల్చారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'కు తరలిన హమాలీలు



బాన్సువాడ : తన న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సోమవారం సివిల్ సప్లయ్ హమాలీలు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు మాట్లాడుతూ సివిల్ సప్లయ్ హమాలీల ఎగుమతి, దిగుమతి హమాలీ రేట్లను పెంచాలని, సొంత గోదాములు నిర్మించాలని, పని భద్రత కల్పించాలని, తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. హమాలీలు సాయిలు, భూమయ్య, పుట్టి సాయిలు, సాయిలు తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికులు..



ఎల్లారెడ్డి : ఎన్నో రోజులుగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఎల్లారెడ్డి మండల భవన నిర్మాణ కార్మికులు సోమవారం చలో కామారెడ్డి కార్యక్రమానికి తరలివెళ్లారు. భవన నిర్మాణ సంఘం జిల్లా కార్యవర్గం పిలుపు మేరకు 'చలో కామారెడ్డి' కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇస్తామన్నారు.

సత్యనారాయణకు డాక్టరేట్ ప్రదానం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన 6వ స్నాతకోత్సవంలో భాగంగా నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద గ్రామానికి చెందిన ఈటెల సత్యనారాయణ గవర్నర్ సీపీ రాధాకృష్ణణ్ చేతులమీదుగా గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. సత్యనారాయణ ప్రొ జయశంకర్ తెయూలో మృత్తికాశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పూర్తిచేశాడు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు. కాగా సత్యనారాయణ పాలెంలోని వ్యవసాయ కళాశాలలో 2018 నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఖమ్మం వెళ్లిన ఆయిల్‌పామ్ రైతులు



భిక్కనూరు : ఖమ్మం జిల్లా ఆశ్వారావు పేటలో 20 ఏళ్లుగా ఆయిల్‌పామ్ పంటలను సాగుచేస్తున్న పంటల పరిశీలనకు జిల్లా రైతులు సోమవారం వెళ్లారు. భిక్కనూరు, తాడ్వాయి, లింగంపేట మండలాలకు చెందిన రైతులు ప్రత్యేక వాహనాల్లో అక్కడ సాగవుతున్న ఆయిల్‌పామ్ పంటల సాగు పరిశీలనతో పాటు అక్కడి రైతుల అభిప్రాయాలను పంట సాగు వల్ల కలిగే ఆర్థికాభివృద్ధి గురించి తెలుసుకున్నారు. వీరి వెంట ఉద్యానవన శాఖాధికారి సంపత్, విశ్వతేజ్ ఆయిల్‌పామ్ కంపెనీ మేనేజర్ కల్యాన్, ప్రతినిదులు సత్యనారాయణ, సాయికుమారు, పరమేశ్‌రెడ్డి ఉన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కోర్సు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద మహిళా డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్సెస్ కోర్సును ప్రవేశపెట్టినట్లు ప్రిన్సిపాల్ రాధిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్‌లో ఎంపీసీ గ్రూప్ నుంచి పాసైన విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశం పొందేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సును ప్రవేశపెట్టడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కోర్సు బీటెక్‌తో సమానమన్నారు.

దండం పెడతాం.. బడికి పంపండి..





లచ్చాపేటలో ప్రభుత్వ స్కూల్‌కు విద్యార్థిని పంపాలని కోరుతున్న హెచ్‌ఎం, లింగంపేటలో..

జిల్లావ్యాప్తంగా బడిబాట కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బృందాలుగా గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. సర్కారు స్కూళ్లలో సౌకర్యాలను వారికి వివరిస్తున్నారు.



బీబీపేటలో..



తాడ్వాయిలో..



నర్వలో..

క్రికెట్ కిట్ల పంపిణీ



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ గ్రామంలోని 13వ వార్డు పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రవి పాటిల్ చిన్న పిల్లలకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవిపాటిల్ మాట్లాడుతూ చిన్నారులు విద్యతోపాటు ఆటపాటల్లో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్, సుంకరి స్వామి, చిన్నారులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

దోమకొండ : మండలంలోని గోపాల్‌పల్లి గ్రామానికి చెందిన పిట్ల కళావతి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న అంబారిపేట గ్రామానికి చెందిన అరుట్ల అనిల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి సోమవారం పరామర్శించి వారికి బియ్యంతో పాటు ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన యువజన సంఘం ప్రతినిధులు తెలిపారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని పెద్ద దేవిసింగ్ తండాలో 'రోడ్డు అధ్వానం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందన వచ్చింది. టిప్పర్ల యజమానులు ఆరోడ్డుపై మొరం వేయించి చదును చేయించారు. కొంతకాలంగా టిప్పర్లు తిరుగుతుండడంతో రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో వారు స్పందించి మొరం వేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : ప్రహరీ నిర్మాణంలో లోపాలు లేకుండా నాణ్యమైన పనులు చేపట్టాలని ఏఈ పీఆర్వో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. నాణ్యత లోపించినట్లు మ దృష్టికి వస్తే చర్యలు తప్పవని గుత్తేదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో క్రికెట్ పోటీలు ప్రారంభం



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను సోమవారం సీఐ రవీంద్ర నాయక్ ప్రారంభించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కురుమ సాయిబాబా తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. మండలంలోని శివనగర్ గేటు వద్ద గల విశాలమైన క్రికెట్ మైదానంలో ఈ పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం నుండి ఐదు రోజులపాటు ఈ టోర్నీ జరుగుతుందన్నారు.

నల్లాల సర్వే పక్కాగా చేయాలి





సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో నాగరాజు, దేశాయిపేట్‌లో మాట్లాడుతూ..

బిచ్కుంద(జుక్కల్) : ఆయా జీపీల్లో కార్యదర్శులు ఇంటింటికీ తిరిగి మిషన్ భగీరథ నల్లాలపై సర్వే చేయాలని బాన్సువాడ డీఎల్‌పీవో నాగరాజు అన్నారు. సోమవారం బిచ్కుంద రైతు వేదికలో మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, పెద్దకొడప్‌గల్ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, జీపీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. సర్వే ఎలా చేయాలి రికార్డుల్లో ఏం నమోదు చేయాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ వర్షాకాలం వస్తుంది సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని, ప్రతిరోజు క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని సూచించారు.

బాన్సువాడ రూరల్ : గ్రామాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కార కోసం ఇంటింట కులాయిల సమగ్ర సర్వేకు ప్రభుత్వ శ్రీకారం చుట్టిందని బాన్సువాడ డీఎల్‌పీవో నాగరాజు అన్నారు. సోమవారం మండలంలోని దేశాయిపేట్ గ్రామ రైతువేదికలో డివిజన్‌లోని 5 మండలాల జీపీ కార్యదర్శులకు సర్వేచేపట్టే విధానంపై ఈ-పంచాయతీ ఆపరేటర్లతో కలిసి యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, ఈ-పంచాయితీ ఆపరేటర్ వినయ్‌కుమార్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, పిట్లం, నిజాంసాగర్ మండలాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు వేయించడంతో స్థానికుల హర్షం



మద్నూర్(జుక్కల్) : మండలంలోని రాచూర్ గ్రామానికి రోడ్డు లేకపోవడంతో మట్టి రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన సోమవారం మొరంతో గ్రామానికి రోడ్డు వేయించారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన సింధేకు రాచూర్ రోడ్డు గురించి పలుమార్లు విన్నవించిన పట్టించుకోక పోవడంతో నూతన ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావుకు ఈ విషయమై విన్నవించామన్నారు. త్వరలో గ్రామానికి బీటీ రోడ్డు వేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని గ్రామస్తులన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



నిజాంసాగర్(జుక్కల్) : పంచాయతీ కార్మికులు తమకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జుక్కల్ మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించారు. కొన్ని నెలలుగా పెండింగ్ ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు సురేశ్‌గౌండ, పంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు గోవింద్ తదితరులు ఉన్నారు.

పశువుల దాహం తీరేదెలా..?



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : ఎండ తీవ్రత కారణంగా తాగునీరు దొరకక మూగజీవాలు అల్లాడుతున్నాయి. మండలంలోని అంజని గ్రామంలో అధికంగా పశువుల పెంపకం దారులు ఉంటారు. గ్రామంలో పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టిలో పాకురు, చెత్తాచెదారం నిండిపోవడంతో కుండీ ఖాళీగా ఉంది. ఈ తొట్టిని శుభ్రం చేసి తాగునీటిని నింపితే పశువులకు ఉపయోగకరంగా ఉంటుందని పశువుల పెంపకందారులు పేర్కొంటున్నారు.

అధికారులకు యూనిఫామ్స్ అందజేత





సదాశివనగర్‌లో ఎంఈవోకు యూనిఫామ్స్ అందజేస్తున్న ఐకేపీ సిబ్బంది, నాగిరెడ్డిపేటలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద మంగళవారం మహిళ సంఘాల సభ్యులు కుట్టిన విద్యార్థుల యూనిఫామ్స్‌ను ఎంఈవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో చందర్ నాయక్, ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీవో సురేందర్ రెడ్డి, డీపీఎం రమేశ్ బాబు, ఏపీఎం రాజిరెడ్డి, సీసీలె గౌరై రాములు, అంజయ్య, లింగం, నరేందర్ రెడ్డి, కృష్ణాంజలి, సౌజన్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం కస్తూర్బా పాఠశాలలో 224 మంది విద్యార్థులకు సంబంధించిన యూనిఫామ్స్‌ను ఎంపీపీ వినీతరెడ్డి, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి చేతులమీదుగా ప్రిన్సిపాల్ వీణకు అందజేశారు. త్వరలోనే విద్యార్థులకు అందజేస్తామని ఏపీఎం జగదీశ్ పేర్కొన్నారు. ఎంపీడీవో పర్భన్న, మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, సీసీలు నారాయణ తదితరులున్నారు.

జాతి వైరం మరిచి..

మాచారెడ్డి : కోతులు కుక్కలు ఎదురు పడితే పెద్ద యుద్ధమే జరుగుతుంది. మాచారెడ్డి అలాంటిది మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో కొద్ది రోజులుగా ఇలా కోతులు, కుక్కలు కలిసే ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆలయానికి వస్తున్న భక్తులు దృశ్యాలను చూసి ఆశ్చర్యపోతున్నారు.



ఆలయ ప్రాంగణంలో ఆడుకుంటున్న కోతులు, శునకం

ఆధ్యాత్మికం

గ్రామ దేవతలకు జలాభిషేకం



మద్నూర్(జుక్కల్) : మృగశిర కార్తె వచ్చిన ఇంత వరకు వర్షాలు కురవకపోవడంతో రైతన్నలు ఏకమై గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని గ్రామ దేవతలకు సోమవారం గ్రామస్తులు జలాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని హనుమాన్, శివాలయం, విఠలేశ్వర ఆలయాల్లో గ్రామస్తులు, యువకులు, రైతులు నీళ్ల బిందెలతో మండల కేంద్రంలో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుతో వెళ్లి ఆలయాల్లో జలాభిషేకం నిర్వహించి మొక్కుకున్నారు. మృగశిరలోకి ప్రవేశించిన వర్షాలు లేక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు ఆలస్యం జరిగితే పంట దిగుబడులపై ప్రభావం చూపుతుందని రైతులు పేర్కొన్నారు. ఈ సారి వర్షాలు సమృద్ధిగా కురిసి రైతన్నల ఇంట్లో సిరి సంపదలు కురువాలని వారు వేడుకున్నారు.

హనుమాన్ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని తాండూర్ గ్రామంలోని త్రిలింగేశ్వరాలయ సమీపంలోని హనుమాన్ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. త్రిలింగేశ్వరాలయ సమీపంలోని పురాతన హనుమ ఆలయానికి తాండూర్‌కు చెందిన మాజీఎమ్మెల్యే ఏర్వ శ్రీనివాస్‌రెడ్డి కుటుంబసభ్యులు ఇటీవల పునఃర్నిర్మాణం గావించారు. ఈ మేరకు సోమవారం ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని జరిపారు. వేద పండితులు అభిలాష్‌శర్మ ఆధ్వర్యంలో పలువురు పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వార్షికోత్సవ నిర్వాహకులు ఏర్వ విజయ భాస్కర్‌రెడ్డి, నందీశ్వర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు సర్వాపూర్‌కు ఎమ్మెల్యే రాక

గాంధారి(ఎల్లారెడ్డి) : మండల పరిదిలోని సర్వాపూర్ గ్రామానికి మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు వస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. శాసన సభ ఎన్నికల్లో మదన్‌మోహన్ రావు తాను నెలకు రూ. 1 మాత్రమే జీతం తీసుకుంటానని మిగిత డబ్బులు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వెంకటి కుటుంబానికి ఆర్థికసాయం చేయనున్నారన్నారు.

నేడు ఐలమ్మ విగ్రహావిష్కరణ

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని పద్మాజీవాడి గ్రామ స్టేజీ వద్ద మంగళవారం రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరణ చేయనున్నట్లు రజక సంఘం ప్రతినిధులు తెలిపారు. అధిక సంఖ్యలో రజకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం దేవునిపల్లి వాసవీ కాలనీలోని మైనారిటీ గురుకుల జూనియర్ బాలుర కళాశాలలో ఇంగ్లిష్, ఫిజిక్స్ బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి ఈనెల 12వ తేదీ బుధవారం సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం, వివరాలకు 86392 54503 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

ఎమ్మెల్యేకు స్వాగతం

ఎల్లారెడ్డి : అమెరికా పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన ఎమ్మెల్యే మదన్మోహన్‌కు ఆదివారం రాత్రి మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మెగా కన్వెన్షన్ వేడుకలకు ప్రత్యేకఅతిథిగా కొద్దిరోజుల క్రితం అమెరికాలోని వాషింగ్టన్ సియాటెల్‌కు వెళ్లారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిబాబా ఉన్నారు.

సదాశివనగర్ కాంగ్రెస్ నాయకులు..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అమెరికా వెళ్లిన ఎమ్మెల్యే ఇటీవల స్వదేశానికి తిరిగి రావడంతో కలిసినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మండల కో-ఆప్షన్ మెంబర్ ఇర్షాదొద్దిన్, మాజీ వైస్ ఎంపీపీ రూపెందర్ రెడ్డి, అడ్లూర్ ఎల్లారెడ్డి విండో చైర్మన్ మర్రి సదాశివరెడ్డి తదితరులున్నారు.

రైతులకు అవగాహన సదస్సు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో రైతు వేదికలో మంగళవారం శాస్త్రవేత్తలతో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి నరేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉదయం 9-10.20 వరకు విత్తనాల ఎంపిక, అధిక సాంద్రత, ప్రతి పంట, సాగు, సేంద్రియ వ్యవసాయంపై రైతుల అనుభవాలు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తున్నామన్నారు.

మంత్రి పదవిస్తే అభివృద్ధి సాధ్యం

మద్నూర్(జుక్కల్) : జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి పదవి కేటాయిస్తే జుక్కల్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని మైనార్టీ నాయకుడు జావీద్ పటేల్ పేర్కొన్నారు.